# డెంగీ పంజా

## ఖమ్మంలో పది రోజుల్లో పది మంది మృతి..

ఖమ్మం రూరల్ మండలం తీర్థాల గ్రామంలో నలుగురు, పల్లెగూడెంలో కేవలం మూడు రోజుల్లో ఇద్దరు, ఎర్రుపాలెంలో ఒకరు, బోనకల్లు మండలం ఆళ్లపాడు మరొకరు డెంగీ, విష జ్వరాలతో ఇటీవలే మృత్యువాతపడ్డారు. ఆయా ప్రాంతాల్లోనే కాదు.. ఉమ్మడి జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లోనూ గడిచిన కొద్ది రోజులుగా జ్వరాల మరణాలు కొనసాగుతూనే ఉన్నాయి. వర్షాల సీజన్ ఆరంభం నుంచే జ్వరాలు ప్రబలుతున్నాయి. ముఖ్యంగా డెంగీ పంజా విసురుతోంది. జ్వరపీడితుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతూనే ఉంది. మునుపెన్నడూ లేని విధంగా పెద్ద వయస్కుల నుంచి చంటి పిల్లల వరకూ వయసుతో సంబంధం లేకుండా విష జ్వరాల భారిన పడుతూ కానరాని లోకాలకు వెళుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు విలవిల్లాడుతున్నారు. కేవలం దోమ కాటు కారణంగా జిల్లాలో మరణ మృదంగం మోగుతుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది.



కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో జ్వర పీడితులు



ఖమ్మం ఆసుపత్రిలో నిండిన బెడ్లు



మురుగులో మంచినీటి పైపులు

**విజృంభించిన జ్వరాలు.. ఖమ్మంలో 400, భద్రాద్రిలో 130 కేసులు**

**ఖమ్మంలో పది రోజుల్లో పదిమంది మృతి.. అల్లాడుతున్న చిన్నారులు..**

**ఉమ్మడి ఖమ్మం జిల్లాను వణికిస్తున్న వైరల్, మలేరియా జ్వరాలు**

**పారిశుధ్యలోపంతో పంచాయతీలు.. ప్రతి ఇంట్లోనూ జ్వరపీడితులు..**

**ఆసుపత్రులకు రోగుల పరుగులు.. ప్రైవేటులో ‘రక్త పరీక్షల’ దోపిడీలు..**

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ ఖమ్మం సిటీ, ఆగస్టు 25: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వైరల్, డెంగీ, మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రధానంగా పారిశుధ్యం పడకేయడంతో సీజనల్, విష జ్వరాలు ప్రజలను చుట్టుముడుతున్నాయి. ఇంటికి ఒకరిద్దరు చొప్పున జ్వర పీడితులు మూలుగుతున్నారు. ఇప్పటికే ఖమ్మం జిల్లాలో 400, భద్రాద్రి జిల్లాలో 130 చొప్పున డెంగీ కేసుల నమోదు కావడం జిల్లాలో జ్వరాల తీవ్రతకు అద్దం పడుతోంది. జ్వరాల విజృంభణతో జ్వరపీడితులందరూ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులన్నీ కిక్కిరిసిపోతున్నాయి. ఇదే అదునుగా భావించిన ప్రైవేటు ఆసుపత్రులు.. రక్త పరీక్షల పేరుతో రోగులను నిలువుదోపిడీ చేస్తున్నారు. అయితే జ్వరాలు విజృంభిస్తున్న ప్రజలు కూడా జాగ్రత్తలు పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

### ఖమ్మంలో 400 డెంగీ పాజిటివ్ కేసులు..

ఖమ్మం జిల్లాను డెంగీ వణికిస్తోంది. ఇంట్లో ఒక్కరికి వచ్చిన జ్వరం.. తరువాత ఆ ఇంట్లో ఉన్న అందరినీ మంచాన పడేస్తోంది. జిల్లాలో డెంగీ పాజిటివ్ కేసుల సంఖ్య 400 మార్క్‌కు చేరువ కావడం ప్రతి ఒక్కరినీ వణికిస్తోంది. ఇవి కేవలం అధికారిక లెక్కలు మాత్రమే. ప్రైవేట్ దవాఖానల్లో నమోదయ్యేవి, అధికారులు దాచి పెడుతున్నవి పరిగణనలోకి తీసుకుంటే ఈ కేసుల సంఖ్య మరింత ఎక్కువగా ఉండే ప్రమాదం ఉంది.

### మొన్నటిదాకా వర్షాలు.. ఇప్పుడేమో జ్వరాలు..

భద్రాద్రి జిల్లాలో మొన్నటిదాకా వర్షాలు దంచికొట్టాయి. ఆ తరువాత వరదలూ ముంచెత్తాయి. వెరసి గ్రామాల్లో చెత్తకుప్పలు పేరుకపోయాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పుణ్యమా అని పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. దీంతో జ్వరాల విజృంభణ జోరందుకుంది. ప్రధానంగా విష జ్వరాల భారినపడుతున్న రోగులు.. ముఖ్యంగా కీళ్లనొప్పులతో ఇబ్బంది పడుతున్నారు. జ్వర పీడితుల క్యూలతో ఆసుపత్రులు నిండిపోతున్నాయి. ప్రభుత్వాసుపత్రుల సిబ్బంది రోగులను సరిగా పట్టించుకోకపోవడం, సగం మందులను బయటకు రాస్తుండడం, కొన్ని పరీక్షలు లేవని చెబుతుండడం వంటి కారణాలతో చాలా మంది రోగులు ప్రైవేటు ఆసుపత్రుల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇదే అదునుగా భావించిన ప్రైవేటు వైద్యులు వివిధ రకాల రక్త పరీక్షల గంట గంటకూ రక్త నమూనాలు తీసుకుంటున్నారు. అందుకు అధిక ఫీజులతో రోగులను పీల్చిపిప్పిచేస్తున్నారు. జిల్లాలో అధికారికంగా ఇప్పటికే 130 డెంగీ కేసులు, 71 మలేరియా కేసులు నమోదు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అలాగే, అన్ని ఆసుపత్రుల్లోనూ డెంగీ, మలేరియా పీడితులకే అధికశాతం బెడ్లను కేటాయిస్తున్నారు.


### పడకేసిన పారిశుధ్యం..

నిన్నా మొన్నటి దాకా వర్షాలు దంచి కొట్టిన నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది. ప్రభుత్వం కూడా పట్టించుకోకపోవడం, ప్రత్యేకాధికారులను నియమించి చేతులు దులుపుకోవడం వంటి కారణాలతో పారిశుధ్యం పూర్తిగా పడకేసినట్లయింది. జ్వరాల విజృంభణకు ఇదే ప్రధాన కారణంగా నిలుస్తోంది. కొన్ని గ్రామాల్లో మంచినీటి పైపులైన్లు మురుగు కాల్వల్లో పడుతున్నాయి. ఫలితంగా తాగునీళ్లు కలుషితమవుతున్నాయి. జ్వర పీడితుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండడంతో ప్రైవేటు ల్యాబ్‌ల యాజమాన్యాలు వాటిని 24 గంటలూ తెరిచే ఉంచుతున్నారు. కొన్నిచోట్ల ప్లేట్‌లెట్లు పడిపోతున్నాయంటూ కొన్ని ల్యాబ్‌లు రిపోర్టులు ఇస్తుండడంతో రోగులు భయంతో వణికి పోతున్నారు.





మురుగు కాలువలో తాగునీటి పైపులు



### జ్వరంతో ఐదేళ్ల చిన్నారి మృతి



చిన్నారి సిద్ధిక్ (ఫైల్)

వైరా టౌన్, ఆగస్టు 25: వైరాలోని శాంతినగర్‌కు చెందిన ఐదేళ్ల చిన్నారి జ్వరంతో మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. వైరాకు చెందిన అక్బర్, నూర్జహాన్ దంపతుల రెండో కుమార్తె సిద్ధిక్ (5) రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని మరో ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చిన్నారి అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతిచెందింది.

### పాజిటివ్ కేసులున్న ప్రాంతాల్లో వైద్య శిబిరాలు పెడుతున్నాం..



ఖమ్మం జిల్లాలో డెంగీతోపాటు విష జ్వరాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాస్థాయిలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ చైర్మన్‌గా వైద్య సేవలను పర్యవేక్షిస్తున్నారు. రోజువారీగా జ్వర సర్వే చేస్తున్నాం. దోమల విజృంభించకుండా చర్యలు తీసుకుంటున్నాం. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. పాజిటివ్ కేసులు నమోదైన ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నాం.

–డాక్టర్ వరికూటి సుబ్బారావు, డీఎంహెచ్‌వో, ఖమ్మం

### ప్లేట్‌లెట్స్ పడిపోయినంత మాత్రాన డెంగీ కాదు..



జిల్లా అంతటా వైరల్ జ్వరాలు ఉన్నాయి. పీహెచ్‌సీల్లో మందులు అందుబాటులో ఉన్నాయి. డెంగీ టెస్టులు ప్రైవేటులో చేయకూడదు. ఎలీసా టెస్టు ద్వారా మాత్రమే డెంగీ పరీక్ష చేయాలి. అయితే ప్లేట్‌లెట్స్ పడిపోయినంత మాత్రాన డెంగీ కాదు. పారిశుధ్య లోపం వల్లే వైరస్ వ్యాప్తి చెందుతోంది. ఈ సీజన్‌లో ప్రతిసారీ జ్వరాలు వస్తూనే ఉంటాయి. వేడిచేసి చల్లార్చినవి నీటినే తాగాలి. జాగ్రత్తలు పాటించాలి.’

–డాక్టర్ భాస్కర్‌నాయక్, డీఎంహెచ్‌వో, భద్రాద్రి

## యువ క్రీడాకారుల్లో నైపుణ్యాలను వెలికితీయాలి

- ప్రతిభా పాటవాలను గుర్తించి వారిని ప్రోత్సహించాలి
- అథ్లెటిక్స్, ఆర్చరీ పోటీల ప్రారంభంలో భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్



హాకీ క్రీడాకారులతో భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్

పాల్వంచ, ఆగస్టు 25: జిల్లాలోని వివిధ క్రీడల్లో పాల్గొంటున్న యువ క్రీడాకారుల్లో నైపుణ్యాలు వెలికి తీయాలని ఐటీడీఏ పీవో రాహుల్ సూచించారు. వారిలోని ప్రతిభ పాటవాలను గుర్తించి వారికి నచ్చిన క్రీడల్లో ప్రోత్సాహించాలని ఆకాంక్షించారు. వారు జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొని పతకాలు సాధించే విధంగా తోడ్పాటు అందించాలని సూచించారు. జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో పాల్వంచ మినీ స్టేడియంలో నిర్వహించిన అథ్లెటిక్స్, ఆర్చరీ క్రీడా పోటలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. ఈ నెల 29న ఒలింపిక్ హాకీ క్రీడాకారుడు, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఈ క్రీడలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ క్రీడల్లో పాల్గొనే యువకులు మేజర్ ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు, యువకులు చదువుతోపాటు వారు కోరుకున్న క్రీడలపైనా ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతిరోజూ సాధన చేస్తూ లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిపోయినంత మాత్రాన నిరుత్సాహ పడవద్దని, మరోసారి గెలవడానికి ప్రయత్నించాలని పేర్కొన్నారు. ఆర్చరీ, అథ్లెటిక్స్ విభాగాల్లో విద్యార్థులు మొదటి స్థానంలో గెలుపొందడానికి శిక్షకులు వారిలో స్ఫూర్తి నింపాలని సూచించారు. ఆర్చరీ, అథ్లెటిక్స్, హామీ కోచ్‌లు కల్యాణ్, నాగేందర్, ఇమాం, టెన్నిస్, హాకీ అసోసియేషన్ల సెక్రటరీలు యుగంధర్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

## నేటి ‘ప్రజావాణి’ రద్దు: కలెక్టర్

కొత్తగూడెం టౌన్/ బూర్గంపహాడ్ (భద్రాచలం), ఆగస్టు 25: కృష్ణాష్టమి పండుగ సందర్భంగా ఈ నెల 26న సోమవారం ప్రభుత్వ సెలవు ఉందని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా సోమవారం నాటి ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చెప్పారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి కలెక్టరేట్‌కు రావొద్దని సూచించారు.

### గిరిజన దర్బార్ కూడా..

ప్రతీ సోమవారం భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించే గిరిజన దర్బార్‌ను కూడా కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా రద్దు చేసినట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు కావడంతో అర్జీలు సమర్పించేందుకు వచ్చే గిరిజనులు సోమవారం ఐటీడీఏకు రావొద్దని సూచించారు. అనంతరం ఐటీడీఏ అధికారులకు, ఏజెన్సీ గిరిజనులకు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.


















## ముకుందా.. మురారి

- నేడు కృష్ణాష్టమి
- ఆలయాలు ముస్తాబు



ఖమ్మం, ఆగస్టు 25 : హిందూ పంచాంగం ప్రకారం ప్రతి ఏడాది శ్రావణమాసం కృష్ణపక్షంలో వచ్చే అష్టమి తిథి నాడు ప్రపంచవ్యాప్తంగా శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగను జరుపుకుంటారు. ప్రతి ఇంట్లో పిల్లలను బాలకృష్ణుడిలా అలంకరించి సంబురాల్లో మునిగిపోతారు. శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పిస్తారు. తమ జీవితాల్లో కష్టాలు తొలిగి సుఖసంతోషాలు నిండాలని కోరుకుంటారు.

### శ్రీకృష్ణుడి జన్మమిలా..

శ్రీ మహావిష్ణువు 8వ అవతారం శ్రీకృష్ణ భగవానుడు. రాక్షసుడైన కంసుడి చెల్లెలు దేవకి. ఆమెకు వసుదేవుడితో వివాహం జరిపించి అత్తారింటికి పంపే సమయంలో ఆకాశవాణి ప్రత్యక్షమై తన చెల్లెలి కడుపులో 8వ సంతానంగా పుట్టే కుమారుడు కంసుడిని అంతమొందిస్తాడని చెబుతుంది. దీంతో ఆగ్రహానికి గురైన కంసుడు తన చెల్లెలు దేవకి, బావ వసుదేవుడిని కర్మాగారంలో బంధిస్తాడు. వారికి పుట్టినబిడ్డలను పురిట్లోనే చంపేస్తూ ఉంటాడు. ఎనిమిదో సంతానంగా శ్రీకృష్ణుడు పుట్టినప్పుడు వసుదేవుడు ఆ గోపాలుడిని బృందావనం తీసుకెళ్లి నందుడు–యశోద దంపతులకు ఇస్తాడు. తిరిగి మధుర వచ్చి తమకు ఎనిమిదో సంతానంగా ఆడపిల్ల పుట్టిందని ఆమెను చంపవద్దని కోరుతాడు. కానీ కంసుడు ఒప్పుకోడు. ఆడపిల్లను చంపేందుకు యత్నిస్తాడు. దాంతో ఆ పాప దుర్గాదేవి అవతారంలో కనిపించి నీ పని అయిపోయినట్టే అని హెచ్చరిస్తుంది. కొన్నేళ్ల తర్వాత కృష్ణుడు పెద్దవాడై మధురకు వచ్చి కంసుడిని చంపుతాడు. దాంతో మధుర ప్రజలకు స్వేచ్ఛ లభిస్తుంది.

### తులసిని సమర్పించాలి

శ్రీకృష్ణాష్టమి రోజున ఏ ప్రసాదం చేసినా అందులో తులసి దళాన్ని తప్పనిసరిగా సమర్పించాలి. తులసి శ్రీకృష్ణుడికి ఎంతో ప్రీతికరమైనది. తులసిదళాన్ని సమర్పించడం వల్ల కన్నయ్య అనుగ్రహం సులభంగా దొరుకుతుంది. ఈ పండుగ పూట శ్రీకృష్ణుడికి, బలరాముడికి రాఖీ కట్టాలి. కన్నయ్యకు ఇష్టమైన మల్లెపూలు, పారిజాతం లేదా దేవగాని పూలను సమర్పించాలి. కృష్ణాష్టమి నాడు ఉపవాస దీక్ష చేసే భక్తులు ఉదయం వేళ పూజలు చేస్తారు. పంచామృతాలతో శ్రీకృష్ణుడి ప్రతిమను శుభ్రం చేస్తారు. కొత్త బట్టలు, నగలు, పూలు, పండ్లతో అలంకరిస్తారు. నైవేద్యంగా మిఠాయి పెడతారు. ఉయ్యాలలో ఉంచి స్వామిని పూజిస్తారు.

### ఉట్టికొట్టే సంప్రదాయం

కృష్ణాష్టమి సందర్భంగా దేశవ్యాప్తంగా ఉట్టి కొట్టే కార్యక్రమాలు నిర్వహిస్తారు. శ్రీకృష్ణుడికి ప్రీతిపాత్రమైన తెల్లటి వెన్న, పెరుగు, పాలను కుండలో ఉంచి దానికి తాడు కట్టి పెద్ద కర్రకు కడుతారు. దానిని ఎవరు కొట్టాలో పోటీ పడతారు.

### ఆలయాలు ముస్తాబు

శ్రీకృష్ణష్టామిని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా శ్రీకృష్ణుడి ఆలయాలు అందంగా ముస్తాబయ్యాయి. భక్తులు ఆలయాలకు నూతనంగా రంగులు వేయడంతోపాటు విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీకృష్ణష్టామిని ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

### జిల్లా ప్రజలకు ‘నామా’ శుభాకాంక్షలు..



శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని జిల్లా ప్రజలకు బీఆర్ఎస్ నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం భువిపై శ్రీకృష్ణ భగవానుడు అవతరించిన పర్వదినం శ్రీకృష్ణ జన్మాష్టమి అని ఆయన పేర్కొన్నారు. ఈ పవిత్రరోజున యువతి యువకులు ఉట్ల పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## చేపలవేటకు వచ్చి మృత్యుఒడిలోకి..

- సీతారామ కాలువలో పడి వ్యక్తి, యువకుడు మృతి
- మృతులు బాబాయి, కొడుకు..
- ఇద్దరూ కొత్తగూడెం వాసులు..
- బూర్గంపహాడ్ మండలం జింకలగూడెం వద్ద ఘటన





జమీరుద్దీన్ (ఫైల్), రియాజ్ (ఫైల్)



మృతదేహాల కోసం గాలిస్తున్న పోలీసులు

సారపాక, ఆగస్టు 25: చేపలు పట్టుకోవాలనే సరదా రెండు నిండు ప్రాణాలను బలిగొన్నది. కాలువలోకి దిగిన ఇద్దరు యువకులు మృత్యు ఒడిలోకి చేరారు. ఈ విషాద ఘటన భద్రాద్రి జిల్లా బూర్గంపహాడ్ మండలం జింకలగూడెం వద్ద సీతారామ కాలువలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కొత్తగూడెం గాంధీనగర్‌కు చెందిన దంపతులు షేక్ జమీరుద్దీన్ (37) – షాహీన్. ఏపీలోని తెనాలికి చెందిన దంపతులు పర్వీన్ – కరీముల్లా. అయితే, షాహీన్, పర్వీన్ అక్కాచెల్లెల్లు. కాగా, పర్వీన్ – కరీముల్లా దంపతులు తమ కుమారుడైన రియాజ్ (17)తో కలిసి రెండు నెలల క్రితం కొత్తగూడెం వచ్చి ఇక్కడే ఉంటున్నారు. ఈ క్రమంలో జమీరుద్దీన్, తన తోడల్లుడి కుమారుడైన రియాజ్ కలిసి చేపలు పట్టేందుకు జింకలగూడెంలోని సీతారామ కాలువ వద్దకు ఆదివారం తెల్లవారుజామున ద్విచక్రవాహనంపై చేరుకున్నారు. వాహనం పక్కన నిలిపి కాలువలో చేపలు పడుతున్నాడు. అక్కడ లోతు ఎక్కువగా ఉండడంతో ప్రమాదవశాత్తూ మునిగి గల్లంతయ్యారు. ఈ సమాచారం అందుకున్న ఎస్ఐ రాజేశ్.. తన సిబ్బందితోపాటు హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. అయితే మధ్యాహ్నం సమయానికి జమీరుద్దీన్, రియాజ్ మృతదేహాలు లభ్యం కావడంతో వాటిని వెలికితీశారు. రియాజ్ ఫోన్ ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వీరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యులు అక్కడికి చేరుకుని విగతజీవులుగా ఉన్న జమీరుద్దీన్, రియాజ్‌లను కన్నీరుమున్నీరుగా విలపించారు. జమీరుద్దీన్‌కు భార్య షాహీనా, కుమార్తెలు ఈషా, షన్నాసిద్ధిక, ఉమర్ ఉన్నారు. రియాజ్ చదువుకునేందుకు వచ్చి ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడంతో అతడి తల్లిదండ్రులు పర్వీనా, కరీముల్లా సైతం రోదించిన తీరు కలిచివేసింది.

### జమీరుద్దీన్‌కు చేపలవేట సరదా..

కొత్తగూడెం గాంధీనగర్‌కు చెందిన జమీరుద్దీన్ మెకానిక్. ఖాళీ సమయాల్లో సరదా కోసం చేపలు పడుతుంటాడు. వేటలో పట్టిన చేపలను ఇంటి వద్ద చుట్టుపక్కల వారికి ఇచ్చి తృప్తి పడుతుంటాడు. ఆదివారం కావడంతో తన తోడల్లుడి కుమారుడైన రియాజ్ (వరసకు కొడుకు)ను తీసుకొని చేపలు పట్టేందుకు వచ్చాడు. చేపల కోసం వచ్చిన వారు తిరిగిరాని లోకాలకు చేరుకోవడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

### ముమ్మరంగా గాలింపు..

జింకలగూడెం వద్ద సీతారామ కాలువలో ఇద్దరు పడిపోయారన్న సమాచారం అందడంతో ఎస్ఐ రాజేశ్ తన సిబ్బందితో ఉదయమే హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. గజ ఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బందితో మధ్యాహ్నం వరకు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం వేళ వారి మృతదేహాలు లభ్యం కావడంతో వాటిని వెలికి తీశారు. పోస్టుమార్టం అనంతరం ఆ మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కొండరెడ్ల కుటుంబాలకు మౌలిక వసతులు కల్పించాలి

### రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ప్రత్యేక కార్యదర్శి శరత్

బూర్గంపహాడ్ (భద్రాచలం), ఆగస్టు 25: బాహ్య ప్రపంచానికి దూరంగా దట్టమైన అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న కొండరెడ్ల గిరిజన కుటుంబాలకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని, అందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ప్రత్యేక కార్యదర్శి శరత్ సూచించారు. కొండరెడ్ల సంక్షేమంపై హైదరాబాద్ నుంచి అన్ని ఐటీడీఏల పీవోలతో ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భద్రాచలం నుంచి పీవో రాహుల్ స్థానిక అధికారులతో కలిసి పాల్గొన్నారు. ప్రధాన మంత్రి జన్‌జాతి, ఆదివాసీ న్యాయమహా అభియాన్ పథకంపై సమీక్షించారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన గ్రామాల్లో కొండరెడ్ల కుటుంబాల్లో ప్రతిఒక్కరికీ ఈ పథకం ద్వారా ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్, ఆయుష్మాన్‌భవ కార్డు, పీఎం కిసాన్ క్రెడిట్ కార్డు, ఫారెస్టు పోడు భూములకు పట్టాలు అందించే కార్డు, రేషన్‌కార్డుతోపాటు గిరిజన గ్రామాల్లో రోడ్డు సౌకర్యం ఉన్నదీ లేనిది సర్వే చేయాలని, స్వచ్ఛమైన మంచినీరు, కరెంటు సౌకర్యాలు సక్రమంగా ఉండేలా చూడాలని సూచించారు. పీవో రాహుల్ మాట్లాడుతూ జిల్లాలో 8 పీవీటీజీ గ్రామాల్లో 368 కుటుంబాల్లో 1,100 మంది కొండరెడ్ల గిరిజనులు నివసిస్తున్నారని, ప్రతి గ్రామంలో క్యాంపులు ఏర్పాటు చేసి అన్ని కార్డులు అప్పటికప్పుడే అందించేందుకు అధికారులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. కొండరెడ్ల అధికారి నరేశ్, ఈజీఎస్ ఏపీవో రామచంద్రరావు, ఏపీఎం వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సమిత, డీటీ రామకృష్ణ, వైద్యులు చైతన్య, జ్యోతి, రాములు, తహసీల్దార్లు పాల్గొన్నారు.